సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం, 10, నవంబర్, 2022

పార్లమెంట్ ఎస్సీ, ఎస్టీ సమావేశంలో అరకు ఎంపీ మాధవి



సాక్షి పాడేరు: పార్లమెంట్ కమిటీ హౌస్‌లో బుధవారం జరిగిన ఎస్సీ,ఎస్టీ సంక్షేమ కమిటీ సమావేశంలో సభ్యురాలు హోదాలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పాల్గొన్నారు. ఎస్సీఎస్టీ వర్గాలకు అమలుజేస్తున్న రిజర్వేషన్లపై సమీక్షించినట్టు ఆమె తెలిపారు.



సీలేరు: సీలేరు ప్రాంతంలో మంచు అందాలు కనువిందుచేస్తున్నాయి. ఉదయం 10 గంటల వరకు పొగ మంచు దట్టంగా కురుస్తోంది. మంచుతెరలు కమ్ముకున్న గంటవాడ డ్యామ్‌లో చేపలవేట దృశ్యాలు కనువిందు చేశాయి.

న్యూస్‌రీల్

ఏపీ ఎన్జీవో డివిజన్ కమిటీ నూతన కార్యవర్గం



ఎన్నికల అధికారులతో నూతన కార్యవర్గం

రంపచోడవరం: ఏపీ ఎన్జీవో రంపచోడవరం డివిజన్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో జరిగాయి. పిఠాపురం యూనిట్ అధ్యక్షుడు ఎ.శ్రీకృష్ణ ఎన్నికల అధికారిగా, కార్యదర్శి పి. సురేషకుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. డివిజన్ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఆర్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కె.రమాకాంత్‌రెడ్డి, ఎంవీ గణపతిరెడ్డి, రెడ్డి శివకుమార్, డి సూర్యప్రభాకర్, కార్యదర్శిగా ఎ.చిత్తరంజన్, సహాయ కార్యదర్శిగా సుధాప్రభాకర్ ఎన్నికయ్యారు.

జనావాసాల్లోకి కొండగొర్రె

అటవీక్షేత్రంలో విడిచి పెట్టిన అధికారులు



అటవీ సిబ్బంది పట్టుకున్న కొండగొర్రెకు చికిత్స చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

అడ్డతీగల: మండల కేంద్రమైన అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని జనావాసాల్లోనికి కొండగొర్రె బుధవారం సాయింత్రం వచ్చేసింది. ఓ ఇంటి ఆవరణలోని మొక్కల మాటున ఉంది. దీనిని గమనించిన ఇంటి యజమానులు అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అటవీ క్షేత్రాధికారి డి.లలితకుమారి, డీఆర్వో రాజారావు, ఇతర సిబ్బంది వచ్చారు. కొండగొర్రెను అటవీక్షేత్రాధికారి కార్యాలయానికి తరలించారు. దాని శరీరంపై అక్కడక్కడ గాయాలు ఉండడంతో పశుసంవర్ధకశాఖ అధికారులను రప్పించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం కొద్దిగా ఆహారం అందించారు. తరువాత అడ్డతీగల శివారులోని పింజరికొండ రక్షిత అటవీ ప్రాంతంలోని టేకు ప్లాంటేషన్ వద్దకు తీసుకువెళ్లి వదిలిపెట్టినట్టు అటవీక్షేత్రాధికారి డి.లలితకుమారి చెప్పారు.

టేకు దిమ్మలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలపతో అటవీసిబ్బంది

ఎటపాక: రక్షిత అటవీ ప్రాంతంలోని టేకు చెట్లను నరికి తయారు చేసిన దిమ్మెలను కారులో తరలిస్తుండగా నెల్లిపాక రేంజ్ అటవీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండల సరిహద్దుల్లోని అటవీప్రాంతం నుంచి కలపను తెలంగాణకు తరలిస్తున్నారన్న సమాచారంతో కొమ్మనాపల్లి వద్ద నిఘా ఏర్పాటు చేసి వాహనాన్ని తనిఖీ చేయడంతో 11 టేకు దిమ్మలు పట్టుబడ్డాయి. వాహనం, కలపను స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించినట్టు రేంజర్ కొండలరావు తెలిపారు. పట్టుబడిన కలప విలువ రూ.78 వేలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఏయూ దూరవిద్య పరీక్షల ఫీజు గడువు డిసెంబర్ 5

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) ప్రథమ, ద్వితీయ, మూడో సంవత్సరం విద్యార్థులు డిసెంబర్ 5వ తేదీ లోగా పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. బ్యాక్‌లాగ్‌లు ఉన్న విద్యార్థులు సైతం పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి పరీక్ష ఫీజును ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలని, దరఖాస్తులను ఏయూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. డిసెంబర్ 12వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుముతో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అసైన్‌మెంట్‌లను డిసెంబర్ 12లోగా అందజేయాలని తెలిపారు. తృతీయ సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 28 నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 28 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు జనవరి 20వ తేదీ నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 55 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇతర సమాచారం కోసం 0891 2844163, 2754966 నంబర్లలో సంప్రదించాలి.

3 నెలలు..రూ.30 వేల ఆదాయం



భారీ స్థాయిలో సాగు చేస్తున్న కాలిఫ్లవర్

- కూరగాయల సాగే జీవనాధారం
- సాగు నుంచి విక్రయం వరకు కుటుంబసభ్యుల భాగస్వామ్యం
- సంతల్లో నేరుగా విక్రయాలు
- రైతు భరోసాతో పెట్టుబడి ఆదా
- దోడిపుట్టు రైతుల విజయగాథ

కూరగాయల సాగు విస్తీర్ణం **400** ఎకరాలు
ఆధారపడిన రైతులు **351** మంది
రోజుకు దిగుబడి **300** కిలోలు
మార్కెటింగ్ సంతల్లో స్వయంగా అమ్మకాలు

ముంచంగిపుట్టులోని దోడిపుట్టు గ్రామం..ఒకటి..రెండు కాదు.. ఏకంగా 30 ఏళ్లుగా కూరగాయల సాగుకు అయి పుపట్టుగా నిలుస్తోంది. ఏడాది పొడవునా ఇక్కడి గిరిజనులు వివిధ రకాల కూరగాయలను పండిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వ్యవసాయ పనుల నుంచి మార్కెటింగ్ వరకు కుటుంబసభ్యులు భాగస్వాములవుతూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రభుత్వం అందించే రైతు భరోసా సొమ్మును ఉపయోగించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని దోడిపుట్టు గ్రామంలో కేవలం 40 కుటుంబాలతో కూరగాయల సాగు ప్రస్థానం మొదలైంది. ఇప్పుడు వాటి సంఖ్య 186కు చేరింది. ఈ గ్రామంలో సుమారు కూరగాయలు పండించే రైతులు సుమారు 351 మంది వరకు ఉన్నారు. వీరంతా 400 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. రోజుకు అన్ని రకాల కూరగాయలు 300 కిలోల వరకు దిగుబడి సాధిస్తున్నారు.



దోడిపుట్టులో క్యాబేజీ సాగులో నిమగ్నమైన గిరిజన రైతులు

వర్షం.. బోర్లు ఆధారంగా..

దోడిపుట్టు రైతులు కూరగాయలను పూర్తిగా వర్షాధారంగా పండిస్తున్నారు. మెట్టభూములు, కొండవాలు ప్రాంతాలను సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనా వాగుల నీటిని పొదుపుగా వాడుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. బోర్లు ఆధారంగా కూడా సాగు చేస్తున్నారు.

మూడు నెలలకు రూ.30 వేలకు పైగా ఆదాయం

ఏడాదిలో ఎకరా విస్తీర్ణంలో మూడు పంటల వరకు పండిస్తున్నారు. పంటను బట్టీ ఒకొక్క దానికి రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఆదాయం మూడు నెలలకు రూ.30 వేల వరకు వస్తోందని రైతులు తెలిపారు. కుటుంబసభ్యులు భాగస్వామ్యం వల్ల కూలి ఖర్చు ఉండదని వారు వివరించారు.

పండించిన కూరగాయలను దళారులపై ఆధారపడకుండా వారే సొంతంగా మార్కెటింగ్ సౌకర్యం సమకూర్చుకుంటున్నారు. ముంచంగిపుట్టు, పెదబయలు, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల వారపు సంతలతో పాటు ఒడిశాలోని మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, పాడువాలో సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. ఇలా తీసుకువెళ్లడం వ్యయప్రయాసలతో ముడిపడి ఉన్నప్పటికీ నేరుగా ఆదాయం పొందగలుగుతున్నామని గిరి రైతులు తెలిపారు. పరిసర ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు.

రైతు భరోసాతో మేలు

ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా సొమ్ము సాగు పెట్టుబడికి ఎంతో ఉపయోగపడుతోంది. గతంలో జోలాపుట్టు వెళ్లి వ్యాపారుల నుంచి వడ్డీకి సొమ్ము తెచ్చుకుని పెట్టుబడికి ఉపయోగించేవారు. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. ప్రభుత్వం అందిందే రైతు భరోసా సొమ్ము, ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించడంతో ఆర్థిక సమస్యలనుంచి గట్టెక్కారు. అధిక దిగుబడి సాధిస్తూ మంచి లాభాలు పొందుతున్నారు. అధిక వర్షాల సమయంలో మాత్రమే కూరగాయల పంటలకు నష్టం జరుగుతుందని గ్రామ రైతులు తెలిపారు.



ముంచంగిపుట్టు వారపు సంతలో అమ్మకాలు చేస్తున్న దోడిపుట్టు మహిళా రైతులు

సాగు చేస్తున్న కూరగాయ పంటలు

క్యాబేజీ: 50 ఎకరాలు, క్యారెట్: 40 ఎకరాలు, టమాటా: 55 ఎకరాలు, పచ్చిమిర్చి: 20 ఎకరాలు, బంగాళదుంప: 70 ఎకరాలు, చిక్కుడు: 40 ఎకరాలు, బీర: 35 ఎకరాలు, వంగ: 46 ఎకరాలు, కాలీఫ్లవర్: 20 ఎకరాలు, తియ్య దుంపలు: 30 ఎకరాలు, బీర: 15 ఎకరాలు, బెండ: 18 ఎకరాలు, ఆకుకూరలు: 60 ఎకరాలు.

పూర్వీకుల నుంచి ఆధారం



పూర్వీకుల నుంచి కూరగాయల సాగు జీవనాధారం. మాకున్న పొలంలో ఏడాదంతా పండిస్తున్నాం. నాలుగైదు రకాల కూరగాయలు, ఒకటి రెండు రకాల ఆకు కూరలను సాగు చేస్తున్నాం.ఒక పంట కోతకు వస్తే మరో పంట వేసుకుంటాం. ఇలా చేయడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులపై మంచి ఆదాయం వస్తుంది. రుచిగా ఉన్నందున ఇక్కడ పండించే కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది.

-కిల్లో మోహన్‌రావు, కూరగాయల రైతు, దోడిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

పూర్తిస్థాయిలో సహకారం



దోడిపుట్టు గ్రామంలో సుమారు 400 ఎకరాల్లో కూరగాయలను పండిస్తున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను ఇప్పటికే అందించాం. పెట్టుబడి సాయంగా రైతు భరోసా సొమ్మును ఉపయోగించుకుంటున్నారు. వివిధ రకాల పంటలను పండిస్తూ వారపు సంతలకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు.

-పి.మోహన్‌రావు, మండల వ్యవసాయశాఖధికారి, ముంచంగిపుట్టు

క్రీడల్లోనూ రాణించాలి



ముసురుమిల్లి పాఠశాలలో విల్లు ఎక్కి పెట్టిన పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సూచించారు. మండలంలోని ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రంపచోడవరం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతిభ కనబరిచే వారిని గుర్తించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. డీడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవో రామతులసి, ఎంఈవో కేవీవీ సత్యనారాయణదొర, హెచ్ఎం కుమార్, పీడీలు సృజనదొర, తిరుపతిరావు, పోతురాజు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, సీఆర్పీఎఫ్ అధికారులు

చింతూరు: క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని సీఆర్పీఎఫ్ ఈ–42 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ సురేష్‌బాబు అన్నారు. సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలో గ్రామీణ యువతకు నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఎంపీపీ సవలం అమలతో కలసి ఆయన బుధవారం ప్రారంభించారు. విజేతలకు ట్రోఫీలతో పాటు క్రీడాకారులకు నెట్, వాలీబాల్, స్పోర్ట్స్ షూ, ట్రాక్‌సూట్లను అందజేశారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్, సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ యాదగిరి, సర్పంచ్ కారం కన్నారావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- వీడియో కాన్ఫరెన్సులో ఆదేశం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో లబ్ధిదారులందరూ గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో అన్నిశాఖల ఇంజనీర్లు, అధికారులు, ఎంపీడీవోలు, ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, సీడీపీవోలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధి హామీ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో రైతు భరోసా, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు, రహదారుల నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నాడు– నేడు రెండవ విడత పనుల పురోగతిపై సమీక్షించారు. ఉపాధిహామీ, గృహ నిర్మాణాలు, జగనన్న స్వచ్ఛ సంకల్పం పనుల పురోగతి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు భూమి సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో తిరస్కరించిన చెల్లింపులపై ఏపీవోలు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల15వ తేదీన భగవాన్ బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈనెల 20న అన్ని గ్రామ సచివాలయాల్లో స్వచ్ఛత శిబిరాలు నిర్వహించాలని సూచించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ల వయసు గల పిల్లలను బడిలో చేర్పించాలని పీవో ఆదేశించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రాజు, డీఈవో పి.రమేష్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్య పడాల్, డీఎల్పీవో పీఎస్ కుమార్, ఉపాధి ఏపీడీ గిరిబాబు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఎంఈవో సరస్వతి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

10,400 లీటర్ల సారా పులుపు ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సారా డ్రమ్ములు

సాక్షి,పాడేరు: పాడేరు ఏఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు హుకుంపేట మండలం రాతులపుట్టు గ్రామ శివారులో బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. సుమారు 10,400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. అనుమానిత వ్యక్తిపై కేసు నమోదు చేశామనిఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీవీజీ రాజు తెలిపారు. రాతులపుట్టులో నిర్వహించిన సమావేశంలో సారా తయారీకి దూరంగా ఉండాలని గిరిజనులకు సూచించామని చెప్పారు. దాడుల్లో 52 ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. దాడుల్లో ఎస్ఈబీ పాడేరుసీఐ సంతోష్, హుకుంపేట, పాడేరు పోలీసుస్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి ధాన్యం కొనుగోళ్లు

- 25 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- జిల్లాలో 56 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- సాధారణ రకం క్వింటాల్ రూ.2040
- 'ఏ' గ్రేడ్ రకం రూ.2060



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



రంపచోడవరంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్


సాక్షి,పాడేరు: జిల్లాలో ఈ ఏడాది 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈనెల 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం తన చాంబర్ నుంచి నుండి జిల్లాలోని సంయుక్త కలెక్టర్, సబ్ కలెక్టర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో 56 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2040లు, ఎ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2060లు మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల మిల్లర్లతో రైతు భరోసా కేంద్రాలను టయ్యప్ చేసి ట్యాగింగ్ చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారులకు యూజర్ ఐడీ, పాస్ వర్డ్ క్రియేట్ చేయాలని, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గణేష్ కుమార్‌ను ఆదేశించారు. అధికారులు వాటిని దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి, వ్యవసాయాధికారులకు తేమ శాతం నిర్ణయించటం, బరువు నిర్ధారణ, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. రైతులతో సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలు, మద్దతు ధరలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో నాణ్యమైన ధాన్యం లభిస్తున్నందున, డీలర్లకు బస్తాకు 600 గ్రాములకు మించి సడలింపు ఇవ్వొద్దని సూచించారు.అన్ని రైతు భరోసా కేంద్రాలకు అవసరమైన ప్రచార సామగ్రి, ఫ్లెక్సీలు సరఫరా చేయాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు: జేసీ

రంపచోడవరం: ఈ ఏడాది జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో బుధవారం జీసీసీ మేనేజర్లతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకొక్క కొనుగోలు కేంద్రంలో పది వేల గోనె సంచులు అందుబాటులో ఉంటాయన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు చెల్లిస్తామన్నారు. పెండింగ్ బిల్లులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధాన్యం తరలింపునకు సంబంధించి లారీ ఓనర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడాలని అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబందించి టెక్నికల్ అసిస్టెంట్లుకు శిక్షణ ఇస్తామన్నారు. రైతుల దగ్గర ధాన్యం తీసుకున్న వెంటనే రశీదు ఇవ్వాలని సూచించారు. జిలా సివిల్ సప్లయి అధికారి గణేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో 15వ తేదీ నుంచి టెక్నికల్ అస్టిసెంట్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. జీసీసీ డీఎం పార్వతీశం, డివిజన్ సివిల్ సప్లయి అధికారి శ్రీహరి, జీసీసీ మేనేజర్లు రాజారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాజంగిలో వినోద క్రీడలు ప్రారంభం

వివాదం పరిష్కరించిన సీఐ రమేష్



సంఘ సభ్యులతో మాట్లాడుతున్న చింతపల్లి సీఐ రమేష్

చింతపల్లి రూరల్: మండలంలోని తాజంగి జలాశయంలో వినోద క్రీడలు బుధవారం పునః ప్రారంభం అయ్యాయి. రెండు వర్గాల మధ్య వివాదం కారణంగా మంగళవారం బోటు షికారు, జిప్‌లైన్ క్రీడలు నిలిచిపోవడం తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు చింతపల్లి సీఐ రమేష్ తాజంగి వెళ్లారు. మత్స్యకార సంఘం, క్రీడల నిర్వహణ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ అనుమతించిన వినోద క్రీడలు మాత్రమే కొనసాగించాలని, అదనంగా ఎటువంటివి నిర్వహించరాదని సూచించారు. దీంతో వివాదం సద్దుమణగడంతో వినోద క్రీడలు ప్రారంభమయ్యాయి.

ఆధునిక వైద్యసేవలు సద్వినియోగం

- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- అరకు ఆస్పత్రిలో స్కానింగ్ సెంటర్ ప్రారంభం




సేవలు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ఆధునిక వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవలని కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. పిరమాల్ సంస్థ, ఆసరా ప్రాజెక్టు ఆధ్వర్యంలో గర్భిణుల సౌకర్యార్థం అరకులోయ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన స్కానింగ్ సెంటర్‌ను బుధవారం వారు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అరకులోయలో 11 ఏళ్లుగా పిరమాల్ సంస్థ, ఆసరా ప్రాజెక్టు ద్వారా ఉచిత సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవలు మన్యం ప్రాంత ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఈ సేవలను మరింత విస్తతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే పాల్గుణ ప్రజలకు సేవలందించేందుకు ముందుకు వస్తే అవసరమైన సహాయం అందిస్తామన్నారు. అనంతరం ఆస్పత్రిలో అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, ఆసరా ప్రాజెక్టు జనరల్ మేనేజర్ పూర్ణలత, మేనేజర్లు భాస్కర్, వంశీకృష్ణ, ఏరియా ఆస్పత్రి వైద్యులు హరి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్ పాల్గొన్నారు.

చలి చంపేస్తోంది

- మన్యంలో కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- అరకులోయలో 13..
- మినుములూరులో 13..
- చింతపల్లిలో 15.4 డిగ్రీలు నమోదు

- 8లో



బాత్‌రూమ్‌లో జారిపడి మహిళ మృతి

మునగపాక: బాత్‌రూమ్‌లో జారిపడి వివాహిత మృతిచెందిన ఘటన మండలంలోని తోటాడలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ మన్మథరావు విలేకరులకు తెలిపిన వివరాలివి. తోటాడ గ్రామానికి చెందిన వివాహిత వేగి యమున (21) మంగళవారం రాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలు జారడంతో కింద పడిపోయింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు అనకాపల్లి వందపడకల ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ యమున మృతిచెందింది. ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త ముత్యాలనాయుడు, ఓ బాబు ఉన్నారు.

గోస్తనీ వద్ద రక్షణ చర్యలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన కాశీపట్నం గోస్తనీ నది వద్ద ప్రమాదాలు నివారణకు పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. కాశీపట్నంలోని ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా భక్తులు వస్తుంటారు. ఇక్కడికి సమీపంలోని గోస్తనీ నదిలో పుణ్యస్నానాలు చేస్తుంటారు. తగిన జాగ్రత్తలు తీసుకోనందున ప్రమాదాలకు గురవుతున్నారు.

- మూడు రోజులక్రితం పాతగోపాలపట్నం ప్రాంతానికి చెందిన బద్ది ఉదయ్‌కుమార్ (19) కుటుంబ సమేతంగా ఇక్కడి ఆలయానికి వచ్చారు. గోస్తనీ నదిలో ఆయన స్నానం చేస్తుండగా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.



గోస్తనీ నది వద్ద సూచనలిస్తున్న ఎస్‌ఐ కరక రాము

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

కాశీపట్నం గోస్తనీ నది వద్ద ప్రమాదాలు జరిగే ప్రదేశంలో బుధవారం ఎస్‌ఐ కరక రాము సిబ్బందితో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రమాదకర ప్రదేశామని బండరాళ్లపై రాయించారు. అనంతరం గ్రామ సచివాలయం మహిళ పోలీసు, వలంటీర్లు, ఆలయ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో సూచనలు జారీ చేశారు. కార్తీకమాసం నేపథ్యంలో పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

> **ప్రమాదకర ప్రదేశాల వద్దకు వెళ్లొద్దు**
>
> గోస్తనీ నది వద్ద ప్రమాదకరమైన ప్రదేశాలు వద్దకు పర్యాటకులు, భక్తులు వెళ్లవద్దు. సరదాగా గడిపేందుకు వచ్చినప్పుడు జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే ప్రమాదాలకు గురికావాల్సి ఉంటుంది. పర్యాటకులు, భక్తులకు తెలిసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశాం. సిబ్బందిని, వలంటీర్లను అప్రమత్తం చేశాం.
>
> – కరక రాము, ఎస్‌ఐ, అనంతగిరి

ఆశలు..అడియాసలు

కాలువలో గల్లంతైన విద్యార్థి మృతి

అనకాపల్లి టౌన్: ఒక్కగానొక్క కుమారుడిని ఉన్నత చదువులు చదివించి ప్రయోజకుడ్ని చేద్దామనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీరామ్‌నగర్‌కు సీహెచ్.వెంకటఅప్పారావు, లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం. వీరిలో ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా మరో కుమార్తె, కుమారుడు ప్రసన్నకుమార్ ఉన్నారు. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి పక్కన చెప్పులు కుడుతూ వచ్చిన సంపాదనతో సాఫీగా సాగిపోతున్న వారి కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. కుమారుడు ప్రసన్నకుమార్(14) జీవీఎంసీ గాంధీనగరం హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. రోజులానే సోమవారం స్కూల్‌కు వెళ్లిన సదరు విద్యార్థి మరో నలుగురు స్నేహితులతో కలిసి మధ్యాహ్నం తుమ్మపాల ఎల్లయ్య కాలువకు ఈత కోసం వెళ్లారు. కాలువలో దిగి ప్రసన్నకుమార్ ఈదుతుండగా ఒక్కసారిగా వచ్చిన నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. మిగిలిన నలుగురు విద్యార్థులు ఎవరికీ చెప్పకుండా వారిళ్లకు వెళ్లిపోయారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు తండ్రి వెంకట అప్పారావు ఇంటికి వచ్చి కుమారుడు గురించి భార్య లక్ష్మిని అడగగా స్కూల్ వెళ్లి ఇంకా రాలేదని చెప్పడంతో తన స్నేహితుల ఇళ్లకు వెళ్లి భోగట్టా చేశారు. ఆచూకీ తెలియకపోవడంతో అప్పారావు అదేరోజు రాత్రి పోలీసులను ఆశ్రయించాడు. హుటాహుటిన సీఐ డి.మోహన్ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. రాత్రి సమయంలో ఆచూకీ కానరాకపోవడంతో మంగళవారం ఉదయం గజఈతగాళ్ల తోపాటు అగ్నిమాపక అధికారులతో సీఐ మోహన్ నదికి చేరుకొని జల్లెడ పట్టారు. సాయంత్రం చీకటిపడే వరకు నదిలో గాలించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో వెనుతిరగాల్సి వచ్చింది. బుధవారం ఉదయం ప్రసన్నకుమార్ నదిలో విగతజీవిగా తేలడంతో మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలో పోస్టుమార్టం చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. ముగ్గురు ఆడబిడ్డల తర్వాత ఒక్కగానొక్క మగసంతానం కలగడంతో ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్నామని, ఇంతలో తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో, తమ ఆశలు అడియాసలయ్యాయంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



ప్రసన్నకుమార్ మృతదేహం

చలి చంపేస్తోంది

పాడేరు: ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోపక్క చలిగాలులు విజృంభిస్తున్నాయి. అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 13 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 13 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని ఘాట్ ప్రాంతాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించలేనంతగా మంచు తెరలు కమ్మేస్తున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి చలిగాలులు వణికిస్తున్నాయి.

రూ.3 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- ఐదుగురి అరెస్టు
- రెండు వాహనాలు సీజ్

నక్కపల్లి: జాతీయ రహదారిపై వేంపాడు టోల్ గేట్ వద్ద బొలెరో వాహనంలో తరలిస్తున్న 180 కిలోల గంజాయిని నక్కపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే రావికమతం నుంచి తుని వైపు బొలెరో వ్యాన్‌లో ప్యాకెట్లలో ఉంచి గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ శిరీష ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది టోల్ గేట్ వద్ద వాహనాలు ఆపి తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న వాహనం పట్టుబడింది. ఈ వాహనం ముందు స్విఫ్ట్ కారు పైలట్‌గా వ్యవహరిస్తూ గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి బొలెరో యజమాని రావికమతం మండలం మట్టవానిపాలెం గ్రామానికి చెందిన దేవర గంగరాజు, పైలట్ వాహనంలో ప్రయాణిస్తున్న తుని సమీపంలో రావికంపాడుకు చెందిన సైపరెడ్డి శ్రీనివాస్, బుచ్చియ్యపేట మండలం బంగారు మెట్టగ్రామానికి చెందిన గండిబోయిన రాజకుమార్, అనకాపల్లి మండలం తమ్మయ్యపేటకు చెందిన వడిసెల సంతోష్‌కుమార్, గొల్లలపాలేనికి చెందిన చొప్పా దేముడులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి వ్యాన్, కారు, రూ.2150 నగదు స్వాదీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- తురకలపూడిలో అండర్–17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభం

బుచ్చెయ్యపేట: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోను రాణించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. తురలకపూడిలో జరిగిన అండర్ 17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ప్రారంభించారు. మట్టిలో ఉన్న మాణిక్యాలను బయటకు తీయాలన్న ఉద్దేశ్యంతో గ్రామ స్థాయి, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేలా క్రీడా పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం, ఆటల పోటీల్లో సాధించిన ప్రతిభతో ఉద్యోగ అవకాశాలు పొందుతారన్నారు. పల్లె గ్రామాల నుంచి వెళ్లి జాతీయ స్థాయిలో రాణించిన పీటీ ఉష, కరణం మల్లేశ్వరి తదితర క్రీడాకారులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామీణ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల నుంచి 170 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. కబడ్డీలో అత్యధిక ప్రతిభ చూపిన 12 మంది బాలికలను, 12 మంది బాలురను ఉత్తరాంధ్ర జిల్లాల ఆటల పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులు ఎంపిక చేసినట్టు పాఠశాల హెచ్‌ఎం కె.శంకర్రావు, పీడీ పి.సూర్యప్రకాష్ తెలిపారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, స్పోర్ట్స్ డైరెక్టర్ జొన్నాడ రవణమ్మ, శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, కోఆపరేటివ్ అధ్యక్షుడు కోరుకొండ అప్పలనాయుడు, సర్పంచ్ గోవింద్, వైస్ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.



తురకలపూడిలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

గిరిజన చట్టాల పరిరక్షణకు కృషి చేయాలి



ఏటీఏ జెండాను ఆవిష్కరిస్తున్నఅసోసియేషన్ నాయకులు

వీఆర్‌పురం: గిరిజన చట్టాల పరిరక్షణకు ఆదివాసీ ఉద్యోగులు కృషి చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) మండల అధ్యక్షుడు సోడె వెంకట్రావ్ అన్నారు. ఏటీఏ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వీఆర్‌పురం జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఏటీఏ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ ఏజెన్సీలో జీవో నంబర్ -3 ని అమలు చేయాలని, నూరుశాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎం.కన్నయ్య, ప్రశాంత్, వెంకట్,రాము, సత్తిబాబు, సుబ్బమ్మ,వెంకటలక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

రాజవొమ్మంగి: రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతిన సీతారాం విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి ఎటువంటి అభివృద్ధి చేకూర్చని ప్రధానమంత్రి మోడీ ఏ ముఖం పెట్టుకుని విశాఖపట్నం వస్తున్నారని ప్రశ్నించారు. ప్రధాని మోడీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన వాటా గురించి రైతులు, కార్మికులు, పేద మధ్య తరగతి ప్రజలు ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా నాయకులు ఎం. వాణిశ్రీ, కోండ్ల సూరిబాబు, జగన్నాథం, శ్రీను, దొరబాబు, సత్యన్నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

అరకులోయ రూరల్: గంజాయి కేసులో మండలంలో చిన్నలబుడు పంచాయతీ మాలిలసల గ్రామానికి చెందిన వంతల సీతారాం అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. 2021 సంవత్సరంలో సీతారాం 16 కిలోల గంజాయి తరలిస్తూ పోలీసుల నుంచి తప్పించుకున్నట్టు చెప్పారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.




నిందితుడితో ఎస్‌ఐ సంతోష్

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యలమంచిలి: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని చట్టాలపై అవగాహన కలిగివుండాలని జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి కె.కె.వి బుల్లికృష్ణ అన్నారు. బుధవారం యలమంచిలి కోర్టు ప్రాంగణంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, కోర్టు నుండి పాత జాతీయ రహదారి వరకు అవగాహన ర్యాలీలో మాదక ద్రవ్యాలకు, పొగాకు, గుట్కా, పాన్ పరాక్, తంబాకు, గంజాయి వంటి వాటికి అందరూ దూరంగా ఉండాలని ముఖ్యంగా విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమార్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న రుగ్మతలను నిర్మూలించి యువతను సరైన మార్గంలో నడిచే విధంగా అందరూ తమవంతు కృషి చేయాలని అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేసి విద్యార్థులకు మత్తు పదార్థాలకు ఏవిధంగా దూరంగా ఉండాలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వాతి భవాని, అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి. వీర రాఘవేంద్రరావు, న్యాయవాది శరగడం అప్పలనాయుడు, దొడ్డా నాగేశ్వరరావు, డి.వెంకటరావు, కరణం శ్రీహరి, కూనిశెట్టి శ్రీను, కోట్ని దుర్గాప్రసాద్, రాజాన గోవిందరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి

చింతపల్లి: పర్యాటక ప్రాంతమైన లంబసింగిలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి ఎంపీపీ కొర్రాబు అనూషదేవి అన్నారు. రిసార్ట్స్ నిర్వాహకులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగికి శీతాకాలంలో వేలాది మంది పర్యాటకులు వస్తుంటారని ఆమె తెలిపారు. పర్యాటకులకు వసతి కల్పించే వారు వారి ఆధార్ నంబర్లు నమోదు చేసుకోడంతో పాటు మద్యం,ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి అనుమతి ఇవ్వకూడదని సూచించారు.పంచాయతీ అధికారుల అనుమతితోనే గుడారాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్,ఎంపీడీవో రమేష్,ఎంపీటీసీ రావుల నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మోరి రవి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపీపీ అనూషాదేవి

పట్టభద్రుల్లో చైతన్యం

ఓటు నమోదుకు భారీగా దరఖాస్తులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఓట్ల నమోదులో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పట్టభద్రులు చైతన్యం చూపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం చేపట్టిన ఓటరు నమోదులో గతంలో కంటే రెట్టింపుగా విద్యావంతులు ఓటర్లుగా దరఖాస్తులు చేసుకున్నారు. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 7 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రాజకీయ పార్టీలన్నీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం వల్ల దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా చేపట్టిన ఓటరు నమోదులో భారీగా దరఖాస్తులు దాఖలయ్యాయి. ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల విద్యావంతులు భారీగానే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. గడువు ముగిసే సమయానికి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుంచి 2,69,535 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఆరు జిల్లాల నుంచి ఆన్‌లైన్‌లో 40 వేల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆరు జిల్లాల పరిధిలో 119 మంది వరకు తహసీల్దార్లు ఆధ్వర్యంలో పరిశీలన జరుగుతోంది. విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 11 మంది తహసీల్దార్లు, ఏడుగురు జోనల్ కమిషనర్లు దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నెల 23న ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తుది ముసాయిదా ప్రకటన చేస్తారు.



విశాఖ కలెక్టర్ కార్యాలయం

అత్యధికంగా విశాఖ జిల్లాలో..

ఉత్తరాంధ్రలో అత్యధికంగా విశాఖపట్నం జిల్లా విద్యావంతులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత స్థానంలో విజయనగరం ఉంది.

జిల్లా	వచ్చిన దరఖాస్తులు
శ్రీకాకుళం	48,967
విజయనగరం	59,281
పార్వతీపురం మన్యం	17,351
అల్లూరి సీతారామరాజు	11,591
అనకాపల్లి	42,104
విశాఖపట్నం	90,241

బాలుడికి చూపు ప్రసాదించిన వైద్యులు

సీతంపేట(విశాఖ ఉత్తర): కర్ర తగిలి నల్లగుడ్డు దెబ్బతిని చూపును కోల్పోయిన నాలుగేళ్ల బాలుడు కొర్రా సింహాద్రికి ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల వైద్యులు ఆపరేషన్ చేసి, తిరిగి చూపును ప్రసాదించారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల చింతపల్లిలో జరిగిన వైద్య శిబిరానికి కొయ్యూరు మండలం బూదర్ల పంచాయతీ పిట్లపాడు గ్రామానికి చెందిన కొర్రా శోభన్‌బాబు తన కుమారుడు సింహాద్రిని తీసుకువచ్చారు. కర్ర తగిలి తన కుమారుడి కంటి చూపు పోయిందని, సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని వైద్యులను కోరాడు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర ఆ బాలుడిని పరీక్షించి కార్నియా (నల్ల పొర) చిట్లిందని, ఆపరేషన్ చేస్తే చూపు వస్తుందని బాలుడి తండ్రికి చెప్పి విశాఖ తీసుకువచ్చారు. ఈ నెల 7న సింహాద్రికి విశ్వామిత్ర ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. బాలుడికి తిరిగి చూపు రావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్య సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడు సింహాద్రితో నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర

జాతీయ బేస్‌బాల్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థిని ప్రతిభ

పాయకరావుపేట: పంజాబ్ రాష్ట్రంలో లూధియానా నగరంలో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థిని కర్రి తనూజ ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొనడం గర్వకారణమని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. తమ పాఠశాలలో విద్యతో పాటు ఆటపాటల్లో కూడా విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన శిక్షణను ఇవ్వడం ద్వారా తమ విద్యార్థి ఈ స్థానానికి చేరుకుందని ఆయన తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు దాసరి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు శివాజీ, అంజి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.



బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని తనూజ